

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

### నాకూ పెళ్ళాం కావాలి

***తలుపు చప్పుడు విని అతను తలుపు తెరిచి చూసాడు. ఎదురుగా వున్న ఆమెని ఓ క్షణం ఆనందంగా చూసాడు. మరుక్షణం కెవ్వున కేక పెట్టాడు.***

"మేఘా" భర్త గావుకేక వినిపించి రాయడం ఆపి, ఓసారి పేడ్ వంక, పెన్ వంక చూసి అడిగింది మేఘ.

"ఏమైంది?"

"ఏమీ కాలేదు. నా సాక్స్ కనబడటంలేదు బంగారం. చూపిస్తావని." డ్రాయింగ్ రూంలోంచి చెప్పాడు అనిల్.

"అక్కడే హేంగర్‌కి తగిలించానండి. ఎదురుగా కనపడతాయని" చెప్పింది.

"కూర్చున్నచోటినించి లేవకుండా ఏంటి మేఘా. వచ్చి చూసి పెట్టు డార్లింగ్"

ఇక తప్పదన్నట్టుగా లేచి షూ రేక్‌లో హేంగర్‌కి తగిలించిన సాక్స్ చూపించింది.

"ఎదురుగా ఉన్నవి కూడా చూసుకోకపోతే ఎలా?" విసుగ్గా అడిగింది.

"అదేంటో డియర్. గంటసేపు వెదికినా ఏవీ కనపడవు. నువ్వు వస్తే, మంత్రం వేసినట్లు చిటికెలో చూపిస్తావు" అనిల్ షూ వేసుకుంటూ చెప్పాడు.

"ప్లీజ్. డిస్టర్బ్ చేయకండి. నేను కథ రాసుకోవాలి. ఎల్లుండి లాస్ట్ డేట్. ఒక్క వాక్యం రాసేసరికి పిలిచారు. కథరాయాలి. దాన్ని టైప్ చేయాలి. మెయిల్ చేయాలి. నాకున్నది ముప్పై గంటల టైం ప్లీజ్. ఈ పోటీలో ఏదో ఒక బహుమతి తెచ్చుకోవాలని.." చెప్పింది మేఘ.

"బహుమతి అంటే ఎంత డార్లింగ్? పదివేలేగా నేనిస్తాను తీసుకో" ఉదారంగా చెప్పాడు అనిల్.

"నేను డబ్బులకోసం రాయడం లేదు. కథల పోటీకి రాయడం అంటే, అదో స్ఫూర్తి, ఇన్‌స్పిరేషన్. చాలా ఉత్సాహంగా ఉంటుంది."

"ఏంటో నీ పిచ్చి. నాకు అర్ధంకాదు కాని రాసుకో" అనిల్ తలుపు దగ్గరకి వేసి వెళ్ళిపోయాడు.

తలుపు బోల్ట్‌వేసి, అమ్మయ్య అనుకుని మళ్ళీ పెన్, పేడ్ తీసుకుంది మేఘ.

ఫోన్ మోగింది. దీక్షగా రాసుకుంటున్న మేఘ ఉలిక్కిపడి, తన సెల్‌ఫోన్‌ని అందుకుంది. అనిల్ నించి.

"మేఘా డియర్. అర్జెంట్ ఫైల్ రాత్రి ఇంటికి తెచ్చాను. ఇప్పుడు తీసుకురావడం మర్చిపోయాను. ప్లీజ్. వెంటనే తెచ్చిస్తావా?"

"ఎందుకలా ఆఫీస్ ఫైల్స్ ఇంటికి తెస్తారు? మళ్ళీ వాటి మొహం చూడరు. పైగా మర్చిపోవడం. నేను కథ రాసుకుంటున్నాను. మీరే వచ్చి తీసుకెళ్ళండి" విసుగ్గా చెప్పింది.

"అమ్మో! ఈ టైంలో ఇంటికెలా వస్తాను డియర్? ఏదో పనిచేసుకుందాం అని తెస్తాకాని, నిన్ను చూడగానే మరిపోతా బంగారం."

"మరి ఫైల్ తెచ్చిన వాళ్ళు రాత్రి ఆపని చేసుకుంటుంటే, నేను నా కథని రాసుకునేదాన్ని కదా? ఆ డొక్కు మరాఠీ సినిమా పెట్టి పక్కన కూర్చుని చూడాల్సిందే అని నా పని కూడా పాడు చేసారు."

"ఇంటికొచ్చాక రెండు దెబ్బలు వేయచ్చులేకాని ప్లీజ్. అర్జెంట్‌గా తీసుకురా" బెడ్‌రూంలో సైడ్ టేబుల్ మీద వుంటుంది గ్రీన్ కలర్ కవర్" అనిల్ చెప్పాడు.

చేసేదిలేక మేఘ డ్రెస్ మార్చుకుని ఫైల్ తీసుకుని బైక్ మీద అనిల్ ఆఫీస్‌కి వెళ్ళింది.

"థాంక్ యూ డియర్. ఇంక ఇవేమీ ఇంటికి తేను" అనిల్ ఆనందంగా చెప్పాడు.

"ఈ పాటికి నాలుగు పేపర్లు రాసుకునేదాన్ని" ఉక్రోషంగా చెప్పింది.

"మేఘా. మర్చిపోయా. సునీతకి ఒంట్లో బాలేదుట. గోపీ ఆఫీస్‌కి రాలేదు. దారేగా ఒకసారి చూసి పోరాదు?" అడిగాడు.

నిస్సహాయంగా చూసింది మేఘ.

"రాసుకోవాలి"

"వాడు నాకెంత ఫ్రెండో తెలుసుగా వెళ్ళిరా. బావుండదు" చెప్పాడు.

"మీరు వచ్చాక సాయంత్రం వెళ్దాం ఇద్దరం కలిసి"

"సాయంత్రం నీతో కబుర్లు చెప్పే సమయం డార్లింగ్. దాన్ని ఎవరికోసం త్యాగం చేయలేను. ఎటూ బయటికి వచ్చావుగా. ఒక కర్టెసీ విజిట్ అంతే. వెళ్ళిరా" అనిల్ లోపలికి వెళ్ళిపోయాడు.

ఉక్రోషంతో కళ్ళవెంట నీళ్ళు తిరుగుతూండగా గోపీచంద్ ఇంటిముందు బైక్ దిగింది మేఘ.

తలుపు తీసిన గోపీచంద్ 'హలో సిస్టర్. రండి' అని సాదరంగా ఆహ్వానించాడు. సునీత బెడ్‌రూంలో మంచం మీద నీరసంగా పడుకుని ఉంది.

"ఏమైంది?" మేఘ అడిగింది.

"బాత్ రూమ్‌లో కళ్ళు తిరిగిపడ్డాను. తల వాష్ బేసిన్‌కి కొట్టుకుంది" చెప్పింది. మేఘ మనసులోనే భర్తని శాపనార్ధాలు పెట్టింది.

"ఏమైనా తిన్నావా? నేను చేసి పెట్టనా?" అడిగింది.

"వద్దు గోపీ ఇడ్లీ తెచ్చి పెట్టాడు. ఇంకేం తినాలని లేదు" సునీత కళ్ళు మూసుకుంది.

"సరే. పడుకో. నేను రెండు రోజుల్లో మళ్ళీ వస్తాను" మేఘ లేచి హెల్మెట్ అందుకుంది.

"సిస్టర్! సిస్టర్" ఆ మాటలు విన్న గోపీచంద్ హడావిడిగా వచ్చాడు. "జస్ట్ హాఫ్అవర్ ఉంటారా? అర్జెంట్ పనివుంది. తను అలా పడిపోయేసరికి ఇంట్లోనే ఉండిపోవాల్సి వచ్చింది. సాధ్యమైనంత త్వరగా వస్తాను."

అతను సమాధానం ఆశించకుండా వెళ్ళిపోయాడు.

మేఘ పళ్ళు పటపట కొరుక్కుంది. తను రాకపోతే ఏం చేసేవాడు?

సునీత నిద్రపోతోంది. ఏం చేయాలో తోచక డ్రాయింగ్ రూంలో కూర్చుంది. కాలం గడుస్తున్న కొద్దీ ఆమెలో టెన్షన్ పెరిగిపోతోంది. రాయబోయేకథ మనసులో గింగిరాలు తిరుగుతోంది. బయటకి రావడమే ఆలస్యమౌతోంది. కొంతమంది ఎంత ప్రయత్నించినా పేపర్ మీద అక్షరం ముక్క రాయలేరట. తనలా కాదు. పెన్ పట్టుకుంటే చాలు చకచకా వెళ్ళిపోతుంది. సమయమే ఉండటంలేదు. 'బుజ్జి, చిట్టీ, కన్నా, బంగారం' అంటూ ఒక్క క్షణం తీరిక లేకుండా పని చేయించుకుంటాడు అనిల్. తన గురించి అసలు ఆలోచించడు అతను కోపంగా, అధికారపూర్వకంగా అడిగితే తనూ 'నేను చేయనుపో' అనేది. కానీ ప్లీజింగ్‌గా అడుగుతాడు. నో అనలేదు. పోనీ వీళ్ళింట్లో తెల్లకాగితాలుంటే రాసుకోవచ్చు. హేండ్‌బేగ్‌లో పెన్ ఎప్పుడూ ఉంటుంది కాబట్టి బాధలేదు అనుకుంది. డ్రాయింగ్ రూంలో చుట్టూ చూసింది. న్యూస్ పేపర్ తప్పించి మరో పేపర్ లేదు. గదుల్లోకి వెళ్ళి వెతకలేదు స్వతంత్రంగా. సునీత మందుల ప్రభావంతో గాఢంగా నిద్రపోతోంది. గోపీచంద్ ఏమైపోయాడో గంట దాటినా రాలేదు. ఆకలి వేస్తోంది మేఘకి. కథ పూర్తిచేసి తిందాం అనుకుని బ్రేక్ ఫాస్ట్ కూడా చేయలేదు. ఇంకో అరగంట అయ్యాక భర్తకి ఫోన్ చేసింది.

"మీ గోపీని ఇంటికి పంపండి. నేను వెళ్ళాలి"

"నువ్వేం మాట్లాడుతున్నావో అర్ధంకావడంలేదు డార్లింగ్" అనిల్ చెప్పాడు.

ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ వివరించింది.

"ఓ! అవునా? ఆఫీస్‌కి రాలేదే? ఎక్కడికి వెళ్ళాడో వస్తాడ్లే" అనిల్ ఫోన్ కట్ చేసాడు.

గోపీచంద్ మూడింటికి వచ్చాడు. ఏదో సంజాయిషీ ఇవ్వబోయాడు కానీ మేఘ వినిపించుకోకుండా బయటకి నడిచింది.

వంట చేసే ఓపిక లేక పొద్దుటి ఇడ్లీలు తినేసి ఓ కప్పు కాఫీ తాగింది. పేడ్ తీసుకుని రాయడం మొదలుపెట్టింది.

***"నన్ను చూసి కంగారు పడతావేంటి రాజా. లోపలికి రమ్మని పిలవ్వే?" ఆమె లోపలికి అడుగులు వేసింది. అతను వణికిపోతూ తలుపు మూయడానికి విఫల ప్రయత్నం చేసాడు"***

ఫోన్ మోగింది రాయడం ఆపి విసుగ్గా దానివంక చూసింది. అనిల్‌నించి

"మేఘా డియర్. నీకు నా బెస్ట్ బడ్డీ కుమార్ గురించి చెప్పానా?" ఉత్సాహంగా అడిగాడు అనిల్.

"చాలాసార్లు చెప్పారు. విషయం చెప్పండి" శాంతంగా అడిగింది.

"వాడు ఏదో పనిమీద మనూరు వచ్చాట్ట. ఇప్పుడే ఫోన్ చేసాడు. రాత్రికి డిన్నర్‌కి వచ్చేయమని చెప్పాను"

"డిన్నరా? నేను ఇవాళ వంట చేయదల్చుకోలేదు. పీజా ఆర్డర్ చేద్దాం అనుకుంటున్నాను. ఆయనకీ అదే పెడతాను" చెప్పింది.

"వ్వాట్? ఇంటికి పిలిచి పీజా పెడతామా బుజ్జీ? నువ్వు చేసే సూపర్ డూపర్ పులావ్ గురించి వాడికి కథలుగా చెప్పాను. వాడు వచ్చినప్పుడు నీ చేత చేయిస్తానని కూడా చెప్పాను. నా బంగారు కదూ ఆ పులావ్, అన్నం, సాంబార్ చెయ్యి చాలు. పులావ్ లోకి ఓ కర్రీ. కావాలంటే దాన్నే వైట్ రైస్‌లో కలుపుకుంటాడులే..." చెప్పుకుపోతున్నాడు అనిల్.

దుఃఖం ముంచుకు వచ్చింది మేఘకి.

"ఒక ఫ్రెండేమో ఇంట్లో కాపలా కూర్చోపెట్టి బలాదూర్ తిరగడానికి వెళ్ళి నా 'డే' అంతా నాశనం చేసాడు. ఇంకో ఫ్రెండ్ వచ్చి నా 'నైట్'ని నాశనం చేస్తాడా?" అరిచింది.

'మరీ డబుల్ మీనింగ్‌లా వుంది డియర్. ఈసారికి ఇలా కానీయ్. సిక్స్‌కల్లా వాడిని పికప్ చేసుకుని వస్తా" అనిల్ లైన్ కట్ చేసాడు.

మేఘ బుగ్గలు కన్నీటితో తడిసాయ్. పెన్, పేడ్ అలమరలో పెట్టి కిచెన్ వైపు నడిచింది.

రాత్రి పదకొండు దాకా స్నేహితులిద్దరూ మాట్లాడుకుంటూనే ఉన్నారు. కిచెన్ సర్ది తను తిని బయటికి వచ్చిన మేఘ బెడ్‌రూంలోకి నడవబోతూంటే, కుమార్ పిలిచాడు.

"మీరూ రండి. మా కాలేజ్ కబుర్లు చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటాయి"

నాకేం ఉండవు. బోర్! అందామనుకుని తమాయించుకుని చెప్పింది.

"మీరు మాట్లాడుకోండి. నాకు పనుంది."

"రా బుజ్జీ వాడు అంత ఇదిగా పిలుస్తుంటే వెళ్ళిపోతావే" అనిల్ ఆహ్వానించాడు.

చేసేదిలేక నిస్సహాయంగా వెళ్ళి అనిల్ పక్కన కూర్చుంది. ఆ మాటలు ఏవీ ఆమెకి ఆసక్తిగా లేవు. ఉదయంనించి పడ్డ వేదనకి గుర్తుగా తలనొప్పిగా వుంది. నిద్రపోవాలనివుంది.

చివరికి పన్నెండుగంటలకి ఊబర్ టేక్సీ పిలుచుకుని కుమార్ వెళ్ళిపోయాడు. కథ విషయం ముల్లులా పొడుస్తున్నా మేఘ మంచం మీదపడి నిమిషంలో నిద్రపోయింది.

మర్నాడు అన్నీ అందించాక అనిల్ ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు. మేఘ స్నానం చేసి పేడ్ పట్టుకుని రెండు పేరాలు రాసింది. అనిల్ నించి ఫోన్. ఆన్సర్ చేయకూడదు అనుకుంది కానీ ఊరుకోడు. మాట్లాడేదాకా చేస్తూనే ఉంటాడు.

"ఏవిటీ?" అడిగింది.

"బంగారం..."

అతనేదో పని చెప్పబోతున్నాడని అర్ధమైఅన్ మేఘ చెప్పింది.

"చచ్చినా ఇల్లు కదలను. మీరు చెప్పే ఏ పనీ చేయను. రేపే లాస్ట్ డేట్. కథ రాయాలి, టైప్ చేయాలి. దయచేసి డిస్టర్బ్ చేయకండి."

"అది వినోదం డియర్. ఇది బ్రతుకు తెరువు సమస్య. అర్జెంట్‌గా నాకో మెయిల్ వెదికివ్వాలి."

"మీరు వెతుక్కోవచ్చుగా?"

"ఎదురుగా ఉన్న వస్తువులే నాకు కనిపించవు. ఇంకా ఏడాది నాటి మెయిల్ ఏం కనిపిస్తుంది చెప్పు."

"ఏడాది నాటి ఈమెయిల్ వెదికివ్వాలా? ఎవరు పంపారు?"

"నేనే నా మెయిల్‌కి నేనే పంపుకున్నాను."

"అలా చాలా పంపుకుంటారుగా?"

"అదేగా సమస్య."

"పోనీ సబ్జెక్ట్ ఏం వుంటుంది?"

"ఏమో! ఏం పెట్టానో గుర్తులేదు. లాస్టియర్ మార్చ్ అని బాగా గుర్తు. ఏప్రిల్ అవచ్చు. లేదా ఫిబ్రవరి అవచ్చు" తేలిగ్గా చెప్పాడు.

మేఘ అసహనం తారాస్థాయికి చేరుకుంది.

"మీరే వెతుక్కోండి" ఫోన్ కట్ చేయబోయింది.

"ఆగాగు. మా బుజ్జికదూ నా బంగారు తల్లికదూ" అనిల్ తనకి అలవాటైన బ్రతిమిలాటని మొదలుపెట్టాడు.

దాదాపు రెండు గంటలు వెదికి మొత్తానికి జనవరి 30న మెయిల్ చేసిన ఆ ఫైల్‌ని పట్టుకుంది. భర్తకి ఫోన్ చేసి అడిగింది.

"అటాచ్ మెంట్ అంటే ఆఫీస్ ఫైల్, పాస్‌కోడ్ లాంటివి ఉంటాయి అనుకున్నా. కానీ అది మీ లెటర్ హెడ్ మీద రాసింది కదా? ఏవో నంబర్లు పక్కన ఎవరివో సంతకాలు వున్నాయి. అదేనా?"

"అదే మైగాడ్! దొరికిందా? వెంటనే నాకు రీసెండ్ చెయ్" అనిల్ ఆనందంగా పరవశించిపోతూ చెప్పాడు.

"ఇది ఆఫీస్ ఫైల్ కాదు. మరేంటో చెపితే కానీ చెయ్యను. డిలీట్ చేసేస్తా" మేఘ బెదిరించింది.

ఓ క్షణం తటపటాయించి అనిల్ చెప్పాడు.

"ప్రభాస్ కొత్త మూవీ స్టార్ట్ అయినప్పుడు ఫస్ట్ టూ డేస్‌లో ఎంత కలెక్ట్ చేస్తుంది అని మా ఫ్రెండ్స్ పందెం కట్టుకున్నాం. వాళ్ళు అనుకున్న ఫిగర్‌ని వాళ్ళ చేతిరాతతో రాసి, సంతకం చేయమని ఆ పేపర్‌ని ఫోటో తీసి మెయిల్‌కి అటాచ్ చేసాను. గెలిచిన వాళ్ళు ఓడిన వాళ్ళకి టీపార్టీ ఇవ్వాలి" అనిల్ కులాసాగా చెప్పుకుపోయాడు.

"మీకు బుద్దుందా?" మేఘ గౌరవంగా తిట్టింది.

"అదేంటి డియర్. అంతమాట అనేసావు?" అనిల్ కంగారుగా అడిగాడు.

"అది బతుకు తెరువు సమస్యా?మూడురోజులనించి నేను టైం చాలడంలేదు అని మొత్తుకుంటుంటే, మీ చెత్త ఫ్రెండ్స్‌తో పనిమానేసి వేసిన చెత్త పందేల కోసం రెండు గంటల టైం వృధా చేస్తారా? ఛీ" మేఘ ఫోన్ పెట్టేసి దాదాపు అరగంట పాటు ఏడుస్తూ ఉండిపోయింది.

ఫోన్ మోగింది. అనిల్ అయితే ఆన్సర్ చేయదల్చుకోలేదు. కానీ శంఖుతీర్ధం నించి.

కాలేజ్‌లో మేఘ క్లాస్‌మేట్ శంకర్రావు శంఖు తీర్ధం అనే కలం పేరుతో కథలు రాస్తూంటాడు.

"ఏం మేఘా ఎన్ని కథలు పంపావు?" కులాసాగ అడిగాడు.

"నువ్వెన్ని పంపావు?" అనుమానంగా అడిగింది.

"నా పేరుతో రెండు, మా ఆవిడ పేరుతో ఒకటి" నవ్వాడు.

"నేనీసారి పంపలేను శంకర్" విచారంగా చెప్పింది.

"నేను వారం సెలవు పెట్టి ఇంట్లో కూర్చుని మూడు కథలు రాసేసా. నువ్వెందుకు రాయలేదు? కథలు నీ వేలి కొసలనించి వేలాడుతున్నాయ్ అంటావుగా?" వెటకారంగా అడిగాడు.

"అవును. రాసేదాన్ని. నీలా నాకూ ఓ పెళ్ళాం ఉంటే రాసేదాన్ని" కసిగా చెప్పింది మేఘ.

"పెళ్ళామా?" శంఖుతీర్ధం తెల్లబోయాడు.

"అవును. నాకూ పెళ్ళాం వుంటే, సాక్స్ ఎదురుగా కనబడుతున్నా తనే వచ్చి ఇస్తుంది. ఫ్రెండ్స్ ఇళ్ళకి కర్టెసీ విజిట్స్‌కి వెళ్తుంది. నా ఫ్రెండ్స్‌కి బిరియానీలు కర్రీలు వండిపెడుతుంది. ఇంకా మర్చిపోయిన ఆఫీస్ ఫైల్స్ తెచ్చిస్తుంది. ఏడాది కిందటి చెత్త ఈమెయిల్స్ వెదికిస్తుంది" ఆవేశంగా అరిచింది మేఘ.

"నువ్వేమంటున్నావో నాకు అర్ధంకావడంలేదు." శంఖు తీర్ధం అయోమయంగా అడిగాడు.

"నువ్వు సెలవు పెట్టి ఇంట్లో ఉంటే మీ ఆవిడ సమయానికి అన్నీ అందించిందా? తిండి, తిప్పలు?"

"అవును."

"నువ్వు రాసుకుంటుంటే డిస్టర్బ్ చేయలేదుగా?"

"లేదు"

"నీకు వచ్చే ఫోన్ కాల్స్ అటెండై ముఖ్యం అనుకుంటేనే నీకు ఇచ్చిందికదా?"

"ఎగ్జాట్లీ."

"మీ యింటికి వచ్చిన వాళ్ళతో తానే మాట్లాడి పంపేసింది కదా?"

"యా"

"అందుకే, ఈ సహకారం కోసమే నాకూ ఓ పెళ్ళాం కావాలి శంకర్! అప్పుడు నేను మూడేంటి? ముప్పై కథలు అవలీలగా రాసేస్తా" నిర్వేదంగా చెప్పింది మేఘ.

"ఒక్క ముక్క అర్థంకాలా."

"అవదు. నువ్వు మగాడివి కదా!" మేఘ లైన్ కట్ చేసింది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments